కథానిక

# చివరకి జరిగినది

రమణశ్రీ

ఊరంతా గాలించినా జానెడు నేలైనా తల దాచుకోడానికి దొరుకుతుందో దొరకదోనని అనుమానపడ్డాడు రంగారావు. ఏకి? ప్రొద్దుణ్ణుంచీ కాలుగాలిన పిల్లిలా పేటపేటకీ తిరిగాడు. సందుగొందులన్నీ వెదికాడు. తనకి మాత్రం సరిపోతే చాలు చిన్నగది. కాస్త కాలేజీకి దగ్గరగా వుండటం తన కనీసపు కోర్కె. అద్దె ఎంతయినా ఇవ్వగలడు.

సాయంత్రం కాఫీతాగి మళ్ళీ అన్వేషణార్థం బయల్దేరాడు ఎవళ్ళనడిగినా ముఖం మీద నవ్వేతూ, మాకేచాలదండీ? మీకెక్కడనుంచి— అనేవారే! ఎలాగైనా తప్పదనీ ఇల్లిల్లూ చూచుకుంటూ బయల్దేరాడు రంగారావు.

నిదానంగా వెడుతూన్న మనిషి చటుక్కున ఆగిపోయాడు. నిశ్చేష్టుడయ్యాడు. “అద్దె కివ్వబడును” అనే బోర్డు, అతనికి దోసిళ్ళతో అమృతం తాగిస్తోంది! కాళ్లు తేలిపోతున్నాయి. అప్పటికప్పుడే ఆ యింట్లో అద్దె పుచ్చుకుని తిరుగుతూన్నట్టు కలలు కంటున్నాడు. ధైర్యంగా గుమ్మందగ్గరికెళ్ళి గంభీరకంఠంలో కేకవేశాడు.

ఇంట్లో ఎవ్వరీ అలికిడీ వినిపించటంలేదు. మనుష్యులే లేనట్టుంది! టిక్కు టిక్కుమంటూ గోడ గడియారం కాలాన్ని కొలుస్తోంది.

కొంత సేపటికి ఎవరో పెద్దమనిషి బయటికొచ్చాడు. “ఎవరు నువ్వు?” అన్నట్టున్నాడు. నలుపులో తెలుపు కలిశాడు. చుట్ట కాలుస్తాడు కాబోలు పళ్ళు నల్లగావున్నాయి. కళ్ళలో చూపులు చూపులకి ముళ్ళలా గుచ్చుకుంటాయి. పొట్టిచేతుల్ని చాపుతూ, “ఏం?” అన్నట్టు తల ఎగరేశాడు. ఇంతలో అతనిభార్య కాబోలు బయటికొచ్చి చూచింది.

రంగారావు గది విషయం మాట్లాడాడు. పెద్దమనిషి ఏమాలోచించుకున్నాడో ఏమో ఐదు నిమిషాలు పొయ్యాక, ఖాళీ లేదన్నాడు.

రంగారావు ముఖం వెలవెలపోయింది. చాలా ఆశలు పెట్టుకొనివచ్చాడు.

“ఎంత అద్దె కావాలంటే అంతా ఇస్తా” పెద్దమనిషి నోరు మెదపలేదు. కుర్చీలో కూర్చుని వెర్రిచూపులు చూడ్డం మొదలుపెట్టాడు. రంగారావుకి భయంవేసింది. అతని భార్య, “రానాయనా! మేడమీది భాగం చూపెడతాను” అంటూ పైకి లాక్కెళ్లింది. పెద్దమనిషి తన చూపులేవో చూస్తూ కళ్లు మూసుకున్నాడు— జబ్బుమనిషి కాబోలనుకున్నాడు రంగారావు.

* * *

రంగారావు సాయంత్రం పెట్టేగిట్టే పట్టించుకుని వచ్చాడు. బండిదిగి లోపలికెళ్లి చూశాడు. ఏమని పిలవాలో తనకి తెలిసిందికాదు.

“ఏవండోయ్! మామ్మగారూ!” అన్నాడు గంభీరకంఠంలో. అసలు మొట్టమొదట రంగారావు కంఠస్వరం ఆకర్షించుతుంది. అధికారసకృతమైననాదం, గనకంగా కంచులాగ మ్రోగుతుంది. ఇక మనిషిలో ఛాయలు, అందగించి నిండుగావుంటై. ఈ రెండూవుంటే మనిషికింకేం కావాలి? ఎక్కడికెళ్లినా దిగ్విజయం.

రెండుమూడుసార్లు కేకవేసినా ఎవరూ పలకలేదు. వీధిలో నౌఖరుకూడాలేదు. మామ్మగారూ లేరు బామ్మగారూ లేరు. కాని ఎవరోభామగారుమాత్రంవచ్చారు పదహారేళ్ళపడుచుతనంలో మిసమిలలీనుతూ.

ఆ అమ్మాయి ఎంతతీవ్రంగా అందో అంత అందంగానూవుంది. “నువ్వేనా ప్రొద్దుటవస్త” అని వెనక్కితిరిగి వెళ్ళిపోతూ, “మా అమ్మలేదు. నీ సామాను నీ గదిలో పెట్టించుకో”అంది.

ఈ అపరిచితైక వచనానికి రంగారావు స్తబ్ధుడయ్యాడు. మేడమీదిగదిలో సామాను పెట్టించుకోడానికి వెళ్ళిపోయాడు.

ఆ అమ్మాయిపేరు సావిత్రి అని తెలిసింది. ఇంకా కన్యగానేవుండిపోయింది. వాళ్లు బాగా ఆస్తిపాస్తులున్నవాళ్ళే! ఆ రోజు రంగారావు

కాలేజికి పోయి తిరిగివచ్చేసరికి సావిత్రి కంఠం మహోన్నతస్థాయిలో చెలరేగిపోయింది, నౌఖరు మీద. ఎందుకో అర్థంకాలేదు రంగారావుకి.

"ఎందుకూ?" అనుకున్నాడు మనసులో.

రంగారావు గుమ్మంలో అడుగుపెట్టేసరికి, సావిత్రినోరుమూసుకుంది. ఏదో గొణుక్కుంటూ లోపలికెళ్ళిపోయింది.

రంగారావు చూచేసరికి సావిత్రి ముడుచుకు పొయ్యేది నరవాసనకిట్టని దేవకన్యలాగ అవతలికి తప్పుకొనేది.

ఆవేళ ఆదివారం.

రంగారావు అత్యవసరంకొద్దీ మేడ మీద తూముదగ్గరేముఖంకడిగాడు. దానికిందనే సర్గ్గా పెసలు, మినువులు ఎండపోసినట్టు చూచుకోలేదు.

నాలుగైదుచెంబులు పోసేసరికి, కిందనుంచి దూషణలు చెలరేగిపోతున్నై. అది సావిత్రి కంఠమే! ఐదు నిమిషాల్లో మేడమీదికొచ్చేసి— రంగారావు ముఖంతుడుచుకొంటూంటే—"ఈ ఇంట్లో మేం ఉండాలనుందా? లేదా? పెసలూ మినుములూ, మీ మొహంమీది మురికితో నాని పోతున్నాయి. అద్దెకు పుచ్చుకున్నా వాళ్ళకి బుద్ధుండాలి, ఇలా అయితే మేంబతకలేం. అన్నీ తగలడిపొయ్యాయ్ రేపటికి మొక్కలు మొలిచి పోతై" అనవలసిననాలుగు ం అని కిందకు దిగిపో యింది సావిత్రి. సావిత్రి అందమైనదే! అందా నికి తగినమాటలా ఇవి?

ఎంతెంత మాటలంది? ఒక అపరిచితవ్యక్తి. తన్నలా అనడానికి సాహసించింది! తన గుండె బొంగరంతిరిగినట్టు తిరిగిపోయింది. మాటిమాటికీ సావిత్రి అన్నమాటలు, ఆత్మాభిమానాన్ని రెచ్చ గొడుతున్నై.

ఆ అమ్మాయికి హృదయముందా? లేకపోతే తనని గుండెచీల్చేమాటలంటుందా? ఎంత సిగ్గు లేనిమనిషికాకపోతే—హృదయాన్ని నిరసనగా పిండుతుందా?

సావిత్రికి క్రిందికిదిగి వెళ్ళిపోయిందిలగాయితు ఆమె మనసు మనసులోలేదు. ఒక మనిషంత మని షిని అమాంతంగాపట్టుకుని పడలేనిమాటలంది! అతన్నడానికి తనకేం హక్కు? పెద్దవాళ్లు పెద్దవాళ్ళ చూచుకుంటారు మధ్య తనకెందుకు? ఆ మాటలన్నందుకు తనకేడవాలనిపించింది నెత్తి మీద బరువెక్కించుకున్నట్టుంది! తిట్లుతిన్నవా ళ్ళెంతబాధపడతారో, తిట్టినవాళ్ళకూ అంతే బాధ! అన్నేసిమాటలనడానికి తనకు సిగ్గులేక పోయింది. తను సిగ్గులేనిమనిషి.

తల్లికూడా కోప్పడింది. ఎదురుచెప్పలేకఅంది. "నువ్వూరుకో! పెద్దమనిషికదా అని ఊరుకుంటే రోజురోజుకు మితిమీరిపోతుంది! ఆ తూముదగ్గర కడగొద్దని ఎన్నిసార్లుచెప్పాం. నాన్నగారు లేక పోబట్టి..." సావిత్రికళ్ళలోనీళ్ళు తిరిగాయి. కళ్ళల్లో నీళ్లు కుక్కుకుంటూ తనగదిలోకి పరుగెత్తుకుపో యింది. రంగారావువచ్చినవారంరోజులకే తనతండ్రి చచ్చిపోయాడు. అప్పుడు రంగారావు చేసిన సాయం, తన మెప్పుకూడా పొందింది. కాని ఇవ్వాళ ఇదేమిటోకాని తిట్టింది!—తలగడలోకి తలదూర్చి, "నాకుబుద్ధిలేదూ? నాకు సిగ్గులేదూ" అనుకుంది.

* * *

మరొకనాడు సినిమాకెళ్లి వచ్చాడు. నౌఖ రుంటే తలుపు తీసేవాడు. దురదృష్టవశాత్తు ఆవేళ నౌఖరు రాలేదు. ఇక రంగారావు దురవస్థ చెప్పలేం. కేకలేసి కేకలేసి పిచ్చెత్తిపోయాడు. ఇక అలాగ్గాదని తలుపు దడదడబాదుతూ "సావి త్రిగారూ!" అని పది ఇరవైసార్లు కేకలేశాడు. సావిత్రి ఒకవిధంగావచ్చి తలుపుతీస్తుందీ?

అసలు నిజానికి సావిత్రి మెలకువగానే వుంది! ఏడిపించాలనే తలుపు తీయలేదు అర గంటవరకూ. రుసరుసలాడుతూ వచ్చి తలుపు తీసింది. "అర్ధరాత్రివరకూ తిరుగుళ్ళు తిరిగి వస్తే తలుపుతీయడానికేం మేము నౌఖర్లంగాం. మాకూ మంచీ, మర్యాదా వుంది" అని చటుక్కున వెనక్కితిరిగి ఊడిపోయిన జడను ముడివేసు కుంటూ వెళ్ళింది. రంగారావు నోరెత్తలేక పొయ్యాడు. అతనికి రాత్రి రాత్రంతా కంటి మీద కునుకులేదంటే నమ్మవలసిందే. ఆ యిం ట్లోంచి పోవాలనుకున్నాడు. చాలాసార్లు అను కుంటున్నాడు కూడా. కాని పోలేదు. పోలేక పోతున్నాడు. ఇన్నిమాటలంటున్నా సావిత్రి మీద తనకెప్పుడూ కోపంవచ్చినట్టు ఫీలవలేదు. పైగా జాలి!—ప్రొద్దున్నలేసేసరికి ప్రక్కమీంచి లేవలేక పోయాడు. కళ్ళెరుపుతో క్రుంగి పోయాడు. వళ్లువేడిగావుంది జ్వరంవచ్చినట్టుంది-

కళ్ళు లోతుకు పీక్కుపోయి వున్నాయి. తన బలాన్నంతా ఎవరో లాక్కున్నట్టు బాధ పడ్డాడు.

పదయినా క్రిందసంగతి తనకి తేలలేదు. ఎవరూ పైకి రాలేదు. అలాగే దుప్పటి కప్పుకు పడుకున్నాడు.

క్రిందనుంచి మాటలు వినిపిస్తున్నాయి. ఇంతలో నౌఖరు పైకొచ్చి "ఏంబాబూ ఎలా వున్నారు?" అన్నాడు. రంగారావు మాట్లాడలేదు. అవస్థచూచి కిందకిదిగి వెళ్ళిపోయాడు. రంగారావు ఎవ్వరికోసం చూట్టంలేదు. జ్వరం తగ్గిపోవాలనే ఆలోచన.

* * *

జ్వరం వచ్చి రెండురోజులయినా తిరుగు ముఖం పట్టలేదు. అల్లాగే బాధపడుతున్నాడు. ఆ నౌఖరే వచ్చిచూసి పోతుండేవాడు.

ఆరోజు మధ్యాహ్నం సావిత్రితల్లి మేడమీదికొచ్చి రంగారావు పరిస్థితి చూచింది.

'ఏంబాబూ! ఎలాగుంది?'

"తలనొప్పి, జ్వరమండీ!"

"ఏవనుకోకు బాబూ! మాపిల్లుంది చూశావా? రాక్షసి. నిన్ను చూద్దామనుకుంటూనే వున్నా. ఆయనున్నపుడు ఎంత సేవచేశావు. నీఋణం ఎలా తీర్చుకుంటానో గాని"

రంగారావు కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. సావిత్రితల్లి రంగారావు నుదురు నిమురుతూ "ఫరవాలేదు నాయనా! త్వరగానే తగ్గిపోతుంది. నౌఖరు తెచ్చిన మందుతాగు" అనిచెప్పి కిందికి వెళ్ళిపోయింది.

రంగారావు ఇంటికో ఉత్తరం రాశాడు ఎవరన్నా పంపమని. రెండురోజులయింది వ్రాసి ఇంకా ఎవరూ దిగలేదు. "మాచెల్లెలైనా ఎవరన్నా వస్తే బాగుణ్ణు" అనుకున్నాడు. ఆ సాయంత్రం బండికి నౌఖరు వీర్రాజు మాత్రం ఇంటిదగ్గర్నుంచి వచ్చాడు. ఆపత్కాలంలో ఆసరా ఆదేచాలు అనుకున్నాడు రంగారావు.

* * *

మరో రెండురోజుల్లో జ్వరం తిరుగుముఖం పట్టింది. వీర్రాజు చేసిన ఉపచారంవల్లనయితేనేం, డాక్టరు మందువల్ల నయితేనేం తగ్గింది. కానీ నీరసం మాత్రం మనిషిని క్రుంగదీసింది. అర్ధసంవత్సరం పరీక్షలు దగ్గరకొస్తున్నై. తను చూస్తే ఈస్థితిలో వున్నాడు.

ఆవేళ సాయంత్రం డాబామీద పచారు చేస్తున్నాడు. విశ్వవిహార నేత్రాలలోంచి మంద మలయ పవనాల అలజడివడిలోంచి కమ్మని పరిమళాల బరువులోంచి, గిలిగింతలుగొనే కోర్కెల వలతీగలలోంచి, తనహృదయం పరువులు తీస్తోంది. తిరిగి చివురిస్తోన్న తన ఆరోగ్యం హృదయాన్ని నిండుకోరికలతో ముంచి తేలుస్తోంది.

నూతిలో చేదవేసి లాగేచప్పుడు, ఆ నిశ్శబ్ద వాతావరణాన్ని భంగపరిచింది; రంగారావు నూతివైపు ఆశగా చూశాడు. సావిత్రి స్నానం చేస్తోంది. చూడకూడదనుకొని ప్రక్కకి తిరిగాడు. కోర్కె ముక్కుతాడువేసిముందుకలాగింది. తిరిగిచూశాడు. మళ్ళీ వెనక జ వేగాడు. సావిత్రి నిజంగా అందమైనదే కావచ్చు. కాని హృదయం లేని శిల. మహాశిల్పి అవయవస్ఫురద్రూపాన్నే చిత్రిస్తాడు. ఆ మహాశిల్పి సౌందర్యానికి సర్వప్రపంచాలు తలలొగ్గుతై అంతే! అది శిల. హృదయంలేని ఒక జడపదార్థం. అట్టిమాదిరిగానే, సావిత్రి ఒక జడపదార్థం కాకపోయినా మనసులేని మనిషి. ఈ మనసులేని మనిషిమీద తనకి ప్రేమనిలవటం వెగటనిపించింది రంగారావుకి. మళ్ళీ చూచాడు. ఇంకా అక్కడేవుండి సబ్బుతో శరీరాన్ని రుద్దుతోంది. రంగారావు నిట్టూర్పు విడుస్తూ పడకకుర్చీమీదకూలబడ్డాడు.

* * *

మరో రెండురోజులుండి రంగారావు నౌఖరు వెళ్ళిపోయాడు. రంగారావు మామూలుగా కాలేజికి వెళివస్తూనే వున్నాడు ఆనాడు శనివారంరోజు పైరివేటు ప్రాక్టికల్స్ అయిపోవటంతోనే గదిలోకొచ్చి ఫిజికల్ థీరీవ్రాసుకుంటున్నాడు. చెవులికి గాజుల గలగల వినిపించింది. అయినా తలెత్తలేదు. ఒక స్నిగ్ధబంగారుహస్తం తలుపు కొట్టింది. ఇప్పుడు తలెత్తిచూశాడు. సావిత్రి!—ఇలా వస్తుందని కలలోకూడా ఆలోచించలేదు. రానీ తనమంచికే వచ్చింది!...

"ఏవన్నా చదువుకోనేపుస్తకాలున్నాయా?"

రంగారావు సమాధానం ఇవ్వటాని కిష్టపడలేదు.

కుర్చీమీద పత్రికల్ని తిరగేస్తూ, "చాలా వున్నాయే!" అంది. రంగారావు మౌనందాల్చి థీరీ వ్రాసుకుంటున్నాడు.

"రెండుపుస్తకాలివ్వరూ? చదివి ఇచ్చేస్తా?"

"........"

"నామీద కోపమా?"

రంగారావుకి జవాబుచెప్పటం ఇష్టంలేదు.

"నేనేం చేశాను? నాతో మాట్లాడరూ? మీకు మాటలు రావూ?"

"..............."

"ఇవ్వకపోతే దాచుకో. ఎవడికీ అక్కరలేదు" సావిత్రి అహం పాటుపోటు పెట్టింది. ఇంత వరకూ తన్నెవరూ అవమానం చెయ్యలేదు. ఇతను తలపెట్టాడు. గిరగిర క్రిందికిదిగి వెళ్లిపోయింది. ఎంతపని చేశాడు? మూర్ఖుడు!—గదిలోకిపోయి మంచంమీద బోరగిలా పడుకుంది. అటూ ఇటూ దొర్లుతూ కోపాన్ని అణుచుకుంటోంది. ముఖ్యంగా చెప్పవలసివస్తే, తన స్వార్థానికి, అహంకారానికి గొప్ప గొడ్డలి పెట్టు.

సాయంసంధ్య అయినా లేవలేదు. తల్లివచ్చి లేపినా లేవలేదు. నౌకరువచ్చి బతిమాలినా విసి చేసింది. సావిత్రి తల్లి వెళ్లి, రంగారావుతో మొర పెట్టింది. రంగారావు "మీరు వెళ్లండి! నేను పంపుతాగా" అన్నాడు.

ముసలమ్మ క్రిందికిదిగి వెళ్లిపోతూ, "పంపు బాబూ! నీకు పుణ్యముంటుంది. దానికి కోపం వస్తే అంతే! ఎవరిమాటా లక్ష్యపెట్టదు" అంది. సావిత్రి గోడవైపు ముఖం పెట్టుకుని పడుకుని వుంది. వేసుకున్న జడ నలిగి, పాము మెలికలు తిరిగి, పడగెత్తి బుసకొడుతూన్నట్టుంది. ఒక్క మాటలో అనాలంటే, ఆ సమయంలో సావిత్రి నలిగిపోయిన అందం అనాలి.

రంగారావు వచ్చిన అలికిడి వినగానే కాళ్లు దగ్గిరికితన్ని పెట్టుకుని ముడుచుకు పడుకుంది.

రంగారావు ధైర్యంగా దగ్గిరికెళ్లి ముహంలోకి చూచాడు. దొంగనిద్ర!

"ఎవరిమీద కోపం?" అన్నాడు. సావిత్రి చలించలేదు. ఎవరన్నట్టు బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ, అటు తిరిగిచూసింది. అతను! తన అహానికి పోటుపెట్టిన అతను! "మీరా," అంది అప్రయత్నంగా.

లేచి పైట సద్దుకుంటూ, "ఎందుకొచ్చారు?" అంది.

"సత్యాగ్రహమా? అత్యాగ్రహమా?"రంగారావు చిరునవ్వు నవ్వుతూ అన్నాడు. "భోజనం ఏంచేసింది? రెండుపూటలు మానేశావు? నా కోసం అయితే కృతజ్ఞుణ్ణి. ఇప్పుడైనా వెళ్లి, భోజనంచేస్తే మరింత కృతజ్ఞుణ్ణి."

నిజమే నన్నట్టు గడియారం ఎనిమిదికొట్టింది.

సావిత్రికి ముచ్చెమటలుపోశాయి. ఇలావచ్చి తన్ను ఓదారుస్తాడనుకోలేదు. పరాయిపిల్లవాడిలా వచ్చి తన్నిలా అధికారపూర్వకంగా, ఆదేశించటం, ఆశించటం ఎందుకు? సిగ్గులేనిదాన్ని తన దగ్గరెందుకురావాలి? ఇదివరకెన్ని మాటలన్నా సిగ్గులేకపోయిందే?

"నా మీద కోపమా?"రంగారావు సౌమ్యంగా అడిగాడు. కోపమేకాదు తాపంకూడాను. తాపానికి కడుపులో ఆకలికూడా కదిలింది. తలనొప్పిగా వుంది, వళ్ళంతా వేడిగా నొప్పులుగావుంది. తన తప్పిదానికి జ్వరంకూడారావచ్చు. మాటామంతీ లేకండా కిందికిదిగి వెళ్ళిపోయింది నీరసంగా అడుగులువేసుకుంటూ.

తెల్లవారేసరికి ముసలమ్మవచ్చి, "అమ్మాయికి జ్వరంగావుంది నాయనా! డాక్టరుకు కబురు చెయ్యవూ?" అంది.

రంగారావు కంగారుపడి వెళ్ళాడు. అరగంటలో డాక్టరువచ్చాడు. ఏంలేదు. మామూలు జ్వరమేవచ్చింది సీసాఇచ్చిపంపమన్నాడు. రంగారావే వెళ్ళాడు.

ఇంకా జ్వరంతగ్గలేదు. రంగారావే సావిత్రి దగ్గరుంటున్నాడు. నౌకరుకు పైపనులు చూసుకోడానికేసరిపోతోంది. సావిత్రి రెండో అంతస్థు గదిలో వుంటోంది. అక్కడగాలీ వెలుతురు బాగావుంటాయని అక్కడికే మార్చారు స్థానం. తల్లి కిందపడుకునివుంది. తను గదిలో వంటరిగా మాత్రంవుంది, కళ్ళు మూసుకుని... రంగారావు తనగదిలో చదువుకుంటున్నాడు.

సావిత్రికేంతోచటంలేదు. జ్వరం ఒక మాదిరిగా అలాగే వుంటోంది, రంగారావు ఇవతలికి వొచ్చి చూశాడు. సావిత్రి కనుసైగచేసింది రమ్మన్నట్టు.

రంగారావు లోపలికెళ్ళాడు.

సావిత్రి ఏదో మాటాడబోయింది.

"లేవకు! పడుకో."

మంచంమీద కూర్చోమన్నట్టు సైగచేసింది. రంగారావు సందేహించాడు. సావిత్రి రెట్టించింది. రంగారావుకూచున్నాడు చేతిని చేతిలోకి తీసుకొని సావిత్రి అంది. "నేనంటే మీకిష్టమేనా?"

"ఇష్టమేకాదు. భయంకూడాను" నవ్వుతూ అన్నాడు రంగారావు.

"మిమ్మల్ని తెలుసుకోలేక చాలా మాటలన్నాను క్షమించండి. మీరు చాలా ఉదార హృదయులు. నేనెన్ని మాటలన్నా మాట్లాడే వారు కారు. అప్పుడే నా కాశ్చర్యమేసింది. సాధారణంగా అందరూ ఊరుకోరు"

"దానికేం! నీవన్న మాటలప్పుడే గాలిలో కలిసిపోయాయి. జ్వరం తగ్గినట్టుంది"

"ఆఁ! నేనొక్క విషయమడుగుతా చెప్పండి. నేనంటే మీకెలాంటి అభిప్రాయం?"

"చాలా అందమైన దానివనీ...ఇంకా... ఇంకా..."

"నేనంటే మీకిష్టమేనా? మళ్ళీ అడుగుతున్నాననుకోకండి ఈమాటమీదే నాజీవితం ఆధారపడివుంది"

"........."

"మీమీదనే మా అమ్మ కొండంత ఆశపెట్టుకొనివుంది"

"నిజంగా! అయితే..."

రంగారావుకు సావిత్రి చెప్పినమాట లర్థమయ్యాయి. సావిత్రి తల్లి తనమీద ఆశపెట్టుకున్నమాట నిజమే! అయితే ఈ గయ్యాళి పిల్లను పెళ్ళిచేసుకోవాలనుకోలేదు. నిజాని కిష్టం లేకపోలేదు. తన్నెరగనప్పుడన్నమాట లిప్పుడు సూదుల్లా గుచ్చుకోసాగాయి. ఆ అమ్మాయితో తనజీవితాన్ని పంచుకోవాలా? ఆలోచనలు పోయాడు. ఎంతలోతుకు పోయినా తనకి తెగని సమస్య అయింది. సావిత్రి రంగారావు మృదుల హస్తాన్ని తన వక్షస్థలంమీద అన్చి, అతని కళ్ళ వైపు ఆశగా చూస్తోంది.

రంగారావుకు ఆవేళ సావిత్రి స్నానంచేసిన రోజు దృక్పథంలో తెరలు కట్టింది. అప్పుడేమో తనలో సావిత్రిమీద కోరికలు మొలకెత్తినమాట నిజమే.

ఇప్పుడేం చేయాలి? సావిత్రికళ్ళు ఆశగా అతనివైపే చూస్తున్నాయి.

"సావిత్రీ" ముఖంమీదికి వంగి అన్నాడు. సావిత్రి పెదవుల్ని స్పృశిస్తూ "నామీద నీకు ఆశా?" అన్నాడు.

ఇంతలో ఆవతల అడుగుల చప్పుడయింది. సావిత్రితల్లి! మంచంమీంచి లేచాడు. లోపలికొచ్చి "అమ్మాయికెలాగుంది నాయనా?" అనడిగింది.

"ఫరవాలేదు తగ్గిపోయిందండి" అని మాత్రం అనగలిగి, తన గదిలోకి వెళ్ళిపోయాడు, సావిత్రి సమస్య ఆలోచిస్తూ.

*　　　*　　　*

వారంరోజుల్లో జ్వరంతగ్గి సావిత్రి మామూలుగా తిరుగుతోనేవుంది. అప్పట్నుంచీ ఎవర్నీ కసరటంగాని, విసరటంగాని జరిగించటం మానేసింది. రంగారావుమీద ఏదో అభిమానం, ఆకాంక్ష తనలో మెదుల్తూన్నట్టు తెలుసుకుంది.


ఆ రోజు ప్రొద్దుటే ముసలమ్మ మేడమీదికొచ్చి "ఇవ్వాళ అమ్మాయి పుట్టినరోజుబాబూ! హోటలుకెళ్ళక. ఇక్కడే భోజనం" అని చెప్పి వెళ్ళింది.

సావిత్రికూడా మేడమీదికొచ్చి చెప్పింది. కాని తను స్టేషనుకెళ్ళాలి. రంగారావునాన్న వస్తానన్నాడు. సరిగ్గా పదిగంటలకి వెళ్ళేసరికి బండిలోంచి దిగుతున్నాడు తండ్రి. అద్దెగదిలోకి తీసుకొచ్చాడు. ముసలమ్మ చాలా మర్యాద చేసింది.

"విషయం రంగారావు వ్రాసివుంటాడు. వెదకబోయే తీగకాలికి తగిలినట్టు, మీ వాడు స్వయంగా మాయింటికొచ్చాడు. అదే పదివేలు. మనసులు కలిశాయి. ఇద్దర్నీ ఒక యింటివాళ్ళను చేయటమే నా ఉద్దేశం."

రంగారావు తండ్రి కాదనలేకపోయ్యాడు.

ఆవేళ సాయంత్రం సావిత్రి రంగారావుతో అంది. "అద్దెకిచ్చుకున్న వాళ్ళకి బుద్ధుండాలి! ముక్కూ మొహమెరుగనివాళ్ళేవళ్ళోవచ్చి ఈ యింటి కల్లుడుగారై పోయారు."



స్టార్ ప్రొడక్షన్స్‌వారి 'బ్రతుకుతెరువు'లో నటిస్తున్న శ్రీరంజని.

దక్షిణదేశ సినిమా పరిశ్రమలోకూడా జరిగింది. అయితే దాక్షిణాత్యులు—ముఖ్యంగా తమిళులు చాలాకాలం కర్నాటక సంగీతాన్ని ఆదరించి, అఖిల ఇండియా సినిమాసంగీతపు ఉప్పెనకు తట్టుకోలేక హిందీ చిత్రాలలోని ట్యూన్‌లను మక్కికిమక్కి కాపీకొట్టసాగారు. హిందూస్థాన్ వారు తమ ప్రాంతీయ జానపద సంగీతాన్ని చిత్రాలలో ప్రవేశపెడితే దాన్నికూడా తమిళులూ, కొంతవరకు ఆంధ్రులూ కూడా తమ చిత్రాలలో అనుకరించారు. తమకూ జానపద సంగీతం ఉన్నట్టు వారికి తట్టలేదు. తమిళులకు తట్టినా ప్రయోజనంలేదు. ఎందుకంటే తమ జానపదసంగీతాన్ని వారు అదివరకే హాస్యానికి ఉయోగించుకుని అపహాస్యం పాల్జేసుకుని ఉన్నారు!

ఇటువంటి పరిస్థితిలోకూడా తెలుగులో "త్యాగయ్య" వంటి సంప్రదాయ సంగీతంగల చిత్రం 1946 నాటికే బయటపడింది.

"త్యాగయ్య," "అమర్ భూపాలీ," "బైజూ బావరా" ఈ మూడు చిత్రాలనుబట్టి ప్రాంతీయ సంప్రదాయ సంగీతాలకు సినిమాలలో మంచి స్థానం ఉండగలదన్న నిర్ణయానికితప్పక రావచ్చు. ఈ చిత్రాలు ఆర్థికంగానూ, కళాదృష్ట్యానూ విజయం సంపాదించాయా లేదా అన్న ప్రశ్న అటుంచి వీటిలోగల సంగీతం ప్రజాదరణ పొందిన మాట యథార్థం. ఇకముందు ఇంకా ఇలాంటి చిత్రాలు వస్తాయనీ, అవికూడా ప్రజాదారణ సంపాదిస్తాయనీ మనం అనుకోవచ్చుకూడా.

ఇందులో ఆశ్చర్యం ఏమీలేదు. సంప్రదాయ సంగీతం విడిగా వింటే ప్రజలకంతగా రుచించక పోయినప్పటికీ, సినిమాచిత్రంయొక్క శిల్పంలో పొదిగి, కథలో సజీవమైన పాత్రలలో ఇమిడ్చి ప్రదర్శించినట్టయితే సన్నివేశాల బలంతో ప్రజల దగ్గిరికి సులభంగా పోగలుగుతుంది. ఆ సంగీతాన్ని ప్రజలకు అందించాలంటే ఏనాడైనా రేడియో కన్న వెయ్యిరెట్లు మంచిసాధనం సినిమా.

అయితే సంగీత చిత్రాలు తియ్యటంలో కొన్ని చిక్కులున్నాయి, మన దేశంలో ఉన్న పెద్ద చిక్కు ప్రతిచిత్రంలోనూ సంగీతం ఉంటూ ఉండటం; ఆ సంగీతం పాత్రల భావ ప్రకటనకు వినియోగించబడుతూండటం, ఒక్కొక్కసారి ఈ సంగీతం సన్నివేశాలలోకికూడా జొరబడుతూండటం, ఇంతప్రాముఖ్యంఇచ్చినా ఆ సినిమా సంగీతానికి "ఇమోషనల్ వాల్యూ" తప్ప మరే ప్రత్యేకతా లేకపోవటం.

మామూలు చిత్రాలు "డ్రామా" మీద ఆధారపడాలి. ఆ "డ్రామా" కూడా పాత్రల మనస్తత్వాలను పురస్కరించుకున్నదిగా ఉండాలి. ఒక్క సంగీత చిత్రాలలోనే "డ్రామా" అన్నది సంగీతపరంగా సాధించటం జరుగుతుంది. మామూలు చిత్రాలకూ, సంగీత చిత్రాలకూ గల ఈ వ్యత్యాసం ప్రజలకు విస్పష్టంగా తెలిస్తేనేగాని వారు సంగీత చిత్రాన్ని ప్రత్యేకించి సంగీతపరంగా ఆనందించలేరు.